ప్రజాశక్తి

మంగళవారం 22 అక్టోబర్ 2024 5

శ్రీ సత్యసాయి





అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

అమరవీరుల త్యాగాలే స్ఫూర్తి

ఆశయసాధనకు విధుల్లో పునరంకితమవుదాం

ఎస్పీ వి.రత్న, కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రజలు, సమాజ భద్రత కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలే స్ఫూర్తిగా వారి ఆశయ సాధనకు విధుల్లో పునరంకితం అవుదామని ఎస్పీ వి.రత్న, కలెక్టర్ టిఎస్.చేతన్ పిలుపునిచ్చారు. సోమవారం నాడు జిల్లా పోలీసు కార్యాలయం పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్ద కలెక్టర్, ఎస్పీతో పాటు జిల్లా జడ్జిలు రాకేష్, శైలజలు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. ఎస్పీ వి.రత్న మాట్లాడుతూ అమరులైన పోలీసుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తించుకుని విధుల్లో పునరంకితం అవ్వాలన్నారు. సమాజ అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం అన్నారు. పోలీసుల సేవలు, త్యాగాలను గుర్తించి ప్రభుత్వం ప్రతి ఏటా నిర్వహించే పోలీస్ అమరవీరుల వారోత్సవాలు మరింత చైతన్యం, స్ఫూర్తి ఇస్తాయన్నారు. జిల్లాలో ప్రజలకు రక్షణ కల్పిస్తూ, శాంతిభద్రతల పరిరక్షకు నిరంతరం పోలీసు శాఖ పని చేస్తోందని చెప్పారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 31వ తేదీ వరకు జిల్లాలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. రక్తదాన శిబిరాలు, పోలీసుల త్యాగాలు తెలియజేసే సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రాల ప్రదర్శనలు, పోలీసుల విధులపై విద్యార్థులకు అవగాహన తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో నిరంతరం శ్రమిస్తున్న పోలీసుల సేవలు వెలకట్టలేనివన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపి ప్రజల శ్రేయస్సుకు అహర్నిశలు పాటుపడుతున్నారని కొనియాడారు. అనంతరం పోలీసు అమర వీరుల కుటుంబాలకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, ఎమ్మెస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, అదనపు ఎస్పీ ఆర్మ్ శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ విజయ్ కుమార్, డీఎస్పీలు విజయ్ కుమార్, శ్రీనివాసులు, శివన్నారాయణ స్వామి, వెంకటేశ్వర్లు, ఏవో సుజాత, సిసి రాఘవేంద్రతో పాటు సిఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాల్సిందే

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా పరిధిలోని పాలసముద్రం గ్రామంలో నాసిన్, బెల్ కంపెనీలకు భూములు కోల్పోయిన రైతులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని అమలు చేయాలని నిర్వాసితులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కలెక్టరేట్ ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పెద్దన్న ఆధ్వర్యంలో ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. తొలుత నాయకులు, నిర్వాసితులు కలెక్టర్ కార్యాలయంలోకి ప్రవేశిస్తుండగా వారిని పోలీసులు అడ్డుకొని లోపలికి అనుమతించకుండా గేట్లు వేశారు.కొంతసేపు పోలీసులకు, భూ నిర్వాసితుల మధ్య తోపులాట జరిగింది. అనంతరం కలెక్టర్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపి, దాదాపు గంటపాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పెద్దన్న మాట్లాడుతూ భూములను ఇచ్చిన రైతులకు నష్ట పరిహారాన్ని ఒకే పద్ధతిలో మంజూరు చేయకుండా అన్యాయం చేశారన్నారు. మూడు పద్ధతుల ద్వారా వాటిని పంపిణీ చేశారని జీవో మాత్రం ఒకటే విడుదల చేసి ఒక్కొక్కరికి ఒక్కో విధంగా పరిహారం అందజేశారని విమర్శించారు. భూములు ఇచ్చిన పేదలకు ఇంతవరకు నష్టపరిహారం, వారి పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని అన్నారు. వారు భూములు కోల్పోయి, ఉపాధి కోల్పోయి వలస బాట పడుతున్నారని తెలిపారు. నాసన్, బెల్ కంపెనీలకు భూములు కోల్పోయిన భూ నిర్వాసిత కుటుంబాలకు కంపెనీలలో అటెండరు, స్వీపర్, వాచ్‌మెన్ పోస్టులు కూడా ఇవ్వలేదన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం వారికి న్యాయబద్ధంగా ఇవ్వవలసిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని ఇవ్వాలని ప్రస్తుత కలెక్టరుకు పదిసార్లు విన్నవించామని అయినా ఫలితం లేదని అన్నారు. ఫైల్ అనంతపురం కలెక్టరేట్‌లో ఉందని దాటవేస్తున్నారని సమస్య పరిష్కరించడానికి చొరవ చూపలేదని, అందుచేతనే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టామని చెప్పారు. కార్యాలయం నుండి స్పష్టమైన సమాచారం వచ్చేంతవరకు పోరాటం సాగిస్తామని, లేనిపక్షంలో విజయవాడలోని ఆర్ అండ్ ఆర్ కమిషనర్ కార్యాలయం ముందు 72 గంటలు దీక్షకు దిగుతామని హెచ్చరించారు. కలెక్టరు, అదనపు కలెక్టర్ కార్యాలయంలో లేని కారణంగా ఆర్డీవో సువర్ణ నిర్వాసితుల ధర్నా వద్దకు వచ్చి సమస్యలను విని, ఖచ్చితంగా కలెక్టర్ దష్టికి తీసుకువెళ్లి 15 రోజులలోపు సమస్యను పరిష్కరిస్తారని హామీ ఇవ్వడంతో నిర్వాసితులు సమ్మెను విరమించారు. అనంతరం ఆర్డీవోకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక కర్షక భవన్ ఆఫీస్ కార్యదర్శి సిద్ధు, వెంకటేష్ ,నిర్వాసితులు అచ్చమ్మ ,వెంకట లక్ష్మమ్మ, వెంకటరాముడు ,గంగమ్మ, శ్రీనివాసులు రెడ్డి ,రామయ్య లక్ష్మీదేవమ్మ ,తదితరులు పాల్గొన్నారు.

◆ కలెక్టరేట్ ఎదుట వ్యకాసం ఆధ్వర్యంలో నాసిన్, బెల్ కంపెనీల భూ నిర్వాసితుల ధర్నా



వ్యకాసం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన నాసిన్, బెల్ కంపెనీల భూ నిర్వాసితులు

యువతలో క్రీడాస్ఫూర్తి నింపేందుకే రాష్ట్రస్థాయి పోటీలు

ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి, శాప్ చైర్మన్ రవినాయుడు

ప్రజాశక్తి-హిందూపురం

యువతలో క్రీడాస్ఫూర్తి నింపేందుకే రాష్ట్రస్థాయి పోటీలను హిందూపురంలో ప్రారంభించినట్లు ఎమ్మెల్యే నందమూరి బాలక్రిష్ణ సతీమణి వసుంధర దేవి అన్నారు. సోమవారం పట్టణంలోని ముదిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను శాప్ చైర్మన్ రవినాయుడుతో కలిసి వసుంధర దేవి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో గౌరవ వందనాన్ని స్వీకరించారు. బంతిని స్వయంగా వేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ యువత నేడు చెడు వ్యసనాలకు బానిస అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని క్రీడల వైపు మళ్లించడం కోసమే రాష్ట్రస్థాయి పోటీలను ఇక్కడ ప్రారంభించామన్నారు. అదే విధంగా విద్యార్థులు సైతం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రీడల్లో మంచి నైపుణ్యత ప్రదర్శిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుంద న్నారు. క్రీడలకు స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలక్రిష్ణ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ఎంజీఎం క్రీడామైదానంలో రూ. 2 కోట్లతో నూతన ఇండోర్ స్టేడియం పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. అయితే గత ప్రభుత్వం దీనిపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పనులు పూర్తి కాలేదన్నారు. దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పనులను వెంటనే పూర్తి చేయించి, ఇండోర్ స్టేడియంను పుర ప్రజలకు అంకితం చేస్తామన్నారు. కార్యక్రమంలో డిఎస్‌డిఒతో పాటు టిడిపి నాయకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వివిధ పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వాలీబాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా క్రీడాజ్యోతి వెలిగిస్తున్న వసుంధర దేవి, చిత్రంలో శాప్ చైర్మన్ రవినాయుడు

విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా

చిలమత్తూరు : విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఇవ్వడమే ధ్యేయంగా ఎమ్మెల్యే బాలక్రిష్ణ పని చేస్తున్నారని ఆయన సతీమణి వసుంధర దేవి అన్నారు. మండలంలోని పాఠశాలలకు కంప్యూటర్లు, ప్రింటర్లు, ఫ్యాన్లు హెరిటేజ్ కంపెనీ సహాయంతో సోమవారం పంపిణీ చేశారు. ఈ మేరకు టేకులోడు గురుకులంలో 50 ఫ్యాన్లు, చిలమత్తూరు జూనియర్ కళాశాలలో 9 అధునాతనమైన కంప్యూటర్లు, 1 ప్రింటర్, చిలమత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 5 కంప్యూటర్లు, కలర్ ప్రింటర్‌ను వితరణ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నారా బ్రాహ్మణికి హిందూపురం నియోజక వర్గం అంటే అమితమైన ప్రేమ అని అన్నారు. ఈ ప్రాంతంలో విద్యార్థులు ఉన్నతమైన స్థానానికి ఎదగాలని కోరుకుంటున్నారని అందుకని ప్రతి ఏటా అనేక పాఠశాలలకు హెరిటేజ్ సంస్థ ద్వార అనేక రకాలుగా సహకారం అందిస్తుంటారని హెరిటేజ్ సిఇఒ ఉపేంద్ర పాండే అన్నారు. అనంతరం టేకులోడు గురుకుల పాఠశాలలో ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. చిలమత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది పరీక్ష కేంద్రాన్ని కొనసాగించాలని, అందుకు సరిపడా డెస్కులు ఇప్పించాలని ఆ పాఠశాల ఉపాధ్యాయులు నందమూరి వసుంధకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో డిఐఇఒ రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే బాలక్రిష్ణ వ్యక్తిగత సహాయకులు బాలాజీ, సురేంద్ర, తహశీల్దార్ యూనస్ బాబు, ఎంపిడిఒ రమణమూర్తి, టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి, బేకరీ గంగాధర్, నందీషప్ప, జనసేన నాయకులు చిన్నా ప్రవీణ్, ఏవీ రమణ పాల్గొన్నారు.

మృత్యుప్రయాణం..!

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. చెల్లెల్ని ఇంటికి తీసుకుని వస్తూ అన్నను .. గాయపడిన స్నేహితున్ని పరామర్శించేందుకు వెళ్తూ మరో యువకుడిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. రొద్దం మండలం పెనుకొండ-పావగడ రహదారి గాలిమరల సబ్‌స్టేషన్ వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకున్న బాధిత కుటుంబాల ఇళ్లలో చీకట్లను నింపింది. ఇందుకు సంబంధించి పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి...



శేషాద్రి (ఫైల్‌ఫొటో)



గంగరాజు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-రొద్దం

రొద్దం దళితవాడకు శేషాద్రి(21) చెల్లెలు విజయవాడలో చదువుతోంది. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన ఆమె తిరిగి ఆదివారం ఉదయం విజయవాడకు బయల్దేరింది. ఈ నేపథ్యంలో చెల్లెల్ని విజయవాడకు పంపేందుకు శేషాద్రి పెనుకొండలో సాయంత్రం 6:30గంటలకు బస్సు ఎక్కించి వచ్చాడు. విజయవాడకు ట్రైన్ ఎక్కేందుకు ధర్మవరం వెళ్లిన యువతకు అక్కడ ట్రైన్ తప్పిపోయింది. దీంతో ఆమె వారి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి విషయం చెప్పింది. దీంతో తల్లిదండ్రులు ఆమెను ఇంటికి వెనక్కు రమ్మన్నారు. ఆమెను పిలుచుకుని రావడానికి శేషాద్రి ద్విచక్రవాహనంలో ధర్మవరం వెళ్లాడు. అక్కడ చెల్లెల్ని తీసుకుని ఇద్దరూ రొద్దం బయల్దేరారు. ఇదే సమయంలో ఆదివారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని పరామర్శించేందుకు రొద్దం మండలం కోగిర గ్రామానికి చెందిన గంగరాజు(23) పెనుకొండకు బయల్దేరాడు. రెండు వాహనాలు పావగడ రోడ్డులోని గాలిమరల సబ్‌స్టేషన్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శేషాద్రి అక్కడికక్కడే మతి చెందాడు. ఈయన చెల్లెలు స్వల్ప గాయాలతో బయటపడింది. మరొక వాహనంలో ఉన్న గంగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన్ను చికిత్స నిమిత్తం పెనుగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యకోసం అనంతపురానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి సమయంలో గంగరాజు మరణించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

రొద్దం : మండలంలోని ఆర్.మరువపల్లి గ్రామంలో సోమవారం మహిళా కూలీలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిఎఫ్ఎల్ కౌన్సిలర్ మోహన్‌కుమార్ మాట్లాడుతూ బ్యాంక్ అకౌంట్, ఎటిఎం కార్డు, పొదుపులు, క్రెడిట్ కార్డు, డిజిటల్ లావాదేవీలు, ఒటిపి, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, బ్యాంకులో పాన్ కార్డు అవసరాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

సిఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడానికే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తుందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్సీ గుండు మల తిప్పేస్వామి, అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వ వైఫల్యాల కారణంగా ప్రస్తుతం ప్రజల నుంచి పెద్దఎత్తున వినతులు వస్తున్నాయన్నారు. ప్రతి అర్జీని పరిశీలించి దశల వారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ రంగస్వామి, తహశీల్దార్ కరుణాకర్, ఎంపీడీవో సోనియాబాయి, సబ్ రిజిస్ట్రార్ నరసింహమూర్తి, ఎపిడి లక్ష్మీనారాయణ, ఏవో తిమ్మప్ప, కుంచితి ఒక్కలిగ రాష్ట్ర కన్వీనర్ విఎం. పాండురంగప్ప, టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, వైబి హళ్లి సర్పంచి రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికే 'పల్లె పండుగ' : ఎమ్మెల్యే

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడానికే కూటమి ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తుందని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. మండలంలోని అయ్యవారిపల్లి, ఎం. రంగాపురం, కల్లుమర్రి గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. అందులో భాగంగానే ప్రతి గ్రామంలో సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, సర్పంచి తిమ్మారెడ్డి, ఎపిడి లక్ష్మీనారాయణ, ఆసుపత్రి కమిటీ మెంబర్ మారుతిరెడ్డి, కృష్ణమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి టిడిపిలో చేరిక

అగళి మండలంలోని పూలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ నాయకులు సోమవారం టిడిపిలో చేరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు యోగేష్ యాదవ్, ఈరన్న, రేవన్న, తిమ్మారెడ్డి, రాజు కుటుంబాలు ఆ పార్టీకి రాజీనామా చేసి టిడిపిలో చేరగా వారికి ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో కుంచితి ఒక్కలిగ రాష్ట్ర కన్వీనర్ విఎం.పాండురంగప్ప, టిడిపి మండల కన్వీనర్లు దాసిరెడ్డి, లక్ష్మీనారాయణ, వైబి.హళ్లి రవీంద్రారెడ్డి, కోడిపల్లి సర్పంచి నరసింహమూర్తి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, గుండుమల

అండగా ఉంటామంటే వేధించడమా..?

సిడిపిఒకు అంగన్వాడీల సూటిప్రశ్న

ప్రజాశక్తి-హిందూపురం

ప్రతి పక్షంలో ఉన్న సమయంలో అండగా ఉంటామని చెప్పి.. అధికారంలోకి వచ్చిన వెంటనే తమను వేధించడం ఎంత వరకు న్యాయమని అంగన్వాడీలు వాపోయారు. అధికార టిడిపి మహిళా విభాగం, టిడిపి నాయకులు అంగన్వాడీ కేంద్రాలను తనిఖీల పేరుతో అంగన్వాడీ కార్యకర్తలను వేధించడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, అంగన్వాడీలు సోమవారం స్థానిక సిడిపిఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి సిడిపిఒ రెడ్డిరమణమ్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి. శ్రీనివాసులు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడవక ముందే అంగన్వాడీ కేంద్రాల తనిఖీ పేరుతో వేధించడం బాధకరమన్నారు. గత ప్రభుత్వంలో అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు 42 రోజుల పాటు ఆందోళన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఆ సమయంలో ప్రతి పక్షంలో ఉన్న టిడిపి నాయకులు, మహిళా విభాగం నాయకులు సమ్మె శిబిరానికి వచ్చి మద్దతు పలికారన్నారు. అంగన్వాడీల సేవలను ప్రశంసించి చేస్తున్న సేవలకు రూ.50వేలు వేతనాలు ఇచ్చిన తక్కువే అని చెప్పిన వారు ఇప్పుడు మంత్రి లోకేష్ చెప్పారని అని చెబుతు సెంటర్లకు వెళ్లి అందరిని బెదరిస్తున్నారని విమర్శించారు. తనిఖీల పేరుతో బెదరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా అధికారాన్ని అడ్డు పెట్టుకుని వేదింపులకు పాల్పడితే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు సిద్దం అవుతామని, అప్పటికి న్యాయం జరగక పోతే చలో నారా లోకేష్ పేరుతో కార్యక్రమాన్ని చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు వీఆర్ రాము, ప్రాజెక్ట్ అధ్యక్షులు శోభమ్మ, కార్యదర్శి లావణ్య, సెక్టర్ లీడర్లు శైలమ్మ, విజయలక్ష్మి, నాగమ్మ పాల్గొన్నారు.



సిడిపిఒ రెడ్డిరమణమ్మకు వినతి ఇస్తున్న సిఐటియు నాయకులు, అంగన్వాడీలు

కూలిన మిద్దె.. తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-రొద్దం

ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని కళ్లకుంట్ల గ్రామంలో సోమవారం ఉదయం ఓ ఇల్లు కూలింది. గ్రామంలోని రామాలయం ముందు ఉన్న ఇంట్లో మూడు కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. పాత మిద్దె కావడంతో పాటు ఇటీవల కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలతో బాగా నాని ఉన్నఫళంగా కూలిపోయింది. ఈ ఘటనలో ఏడేళ్ల బాలిక నీరజతో పాటు ఓ మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. నీరజ కూలిన ఇంటి ఇటుకుల మధ్య చిక్కుకోగా గమనించిన కుటుంబ సభ్యులు అప్రమత్తమై స్థానికుల సాయంతో బయటకు తీసి హుటాహుటిన 108 ద్వారా హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



కూలిన ఇంటి పైకప్పు

ట్రూ అప్ విధానం రద్దు చేయాలి

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

ట్రూ అప్ విధానాన్ని రద్దు చేయాలని పెరిగే విద్యుత్ ఛార్జీల నుంచి విముక్తి కల్పించాలి ఆర్ఎస్‌పి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో టి.ఆనంద్ కుమార్‌కు రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ(ఆర్ఎస్‌పి) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినత పత్రం ఇచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీల పెంపు, ట్రూ అప్ విధింపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, తదితర వాటిపై విద్యుత్తు ఛార్జీల పెనుభారాలను విరమించుకోవాలన్నారు. కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలను అమలు చేయవద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు తిప్పన్న, ఎం.నరసింహులు, శ్రీరాములు, గంగాధర్ పాల్గొన్నారు.

ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక

పెనుకొండ టౌన్ : పట్టణ సమీపంలోని ఎన్ కన్వెన్షన్ హాలులో ఆదివారం సత్యసాయి జిల్లా ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి స్టేట్ జనరల్ సెక్రటరీ కె.పుల్లారెడ్డి, స్టేట్ అడ్వైజర్ నాగపేరయ్య ముఖ్యఅథితులుగా హాజరయ్యారు. సత్యసాయి జిల్లా అపుస్మా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఎస్.రియాజ్‌బాషా, గౌరవాధ్యక్షులుగా ఎస్. ప్రభాకర్, వైస్ ప్రెసిడెంట్‌గా కె.శ్రీనివాసులు, జనరల్ సెక్రటరీగా ఎస్.గౌస్‌బాషా, ట్రెజరర్‌గా జె.శ్రీకాంత్‌రెడ్డిని ఎన్నుకున్నారు. సమావేశంలో ఏనుగుల ఇలియాజ్, లింగారెడ్డి, మల్లికార్జున, తదితరులు, కరస్పాండెంట్‌లు 200 మంది వరకూ హాజరై వివిధ సమస్యలపై చర్చించారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

రొద్దం : మండలంలోని నారనాగేపల్లి గ్రామంలో పాముల అంకన్న భార్య మృతి చెందింది. వారిది పేద కుటుంబం కావడంతో సోమవారం స్థానిక టిడిపి నాయకులు రూ. 6 వేలు ఆర్థిక సాయం అందజేసి కుటుంబ సభ్యులను పరామర్శిం చారు. ఆర్థిక సాయం చేసిన వారిలో మాజీ సర్పంచి మనోహర్, నాగిరెడ్డి, లింగప్ప, మహేష్, ఈ.చిన్నప్పయ్య, హెచ్.రాజు, హేమాద్రి ఉన్నారు.

కోరం లేక మండల మీట్ వాయిదా

గోరంట్ల : ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే 22 మంది ఎంపీటీసీ సభ్యులకు గానూ ఆరుగురు మాత్రమే హాజరవడంతో కోరం లేకపోవడంతో మంగళవారానికి సమావేశం వాయిదా వేసినట్లు ఎంపిడిఒ నరేంద్ర కుమార్ తెలిపారు.

వర్ష సైనిక్ స్కూల్ విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి-గుడిబండ

పోలీస్ అమరవీరుల వారోత్సవాలు సందర్భంగా సోమవారం ఎస్ఐ ముని ప్రతాప్ ఆధ్వర్యంలో పోలీసులు, స్థానిక వర్ష సైనిక్ స్కూల్ విద్యార్థులు పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు సమాజానికి పోలీస్ అమరవీరుల త్యాగాలను గుర్తు చేస్తూ నినాదాలు చేస్తూ మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం స్టేషన్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ పోలీసు వ్యవస్థ, రికార్డుల నిర్వహణ, కేసులు, ఆయుధాలు, తదితర విషయాలపై విద్యార్థులకు వివరించారు. అలాగే దేశం కోసం సరిహద్దులో ప్రాణాలర్పించిన అమరవీరుల చరిత్రను తెలిపారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలీసులు, సైనిక్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలోని పోలీస్ పార్కులో ఏర్పాటుచేసిన పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద పోలీసులు ఘనంగా నివాళులర్పించారు. సిఐలు రామారావు, రాజ్‌కుమార్, ఎఎస్ఐ బ్రహ్మానందరెడ్డి, పోలీసులు, హోంగార్డులు నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఎందరో పోలీసులు ప్రజల కోసం ప్రాణాలర్పించారని వారి సేవలను కొనియాడారు.

'మంత్రిపై అసత్య ప్రచారం చేస్తే సహించం'


ప్రజాశక్తి-పెనుకొండ

రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవితపై అసత్య ప్రచారం చేస్తే సహించేది లేదని నియోజకవర్గంలోని అన్ని మండలాల టిడిపి నాయకులు హెచ్చరించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంత్రి సవిత నియోజక వర్గంలోని ఐదు మండలాల్లో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతుందన్నారు. కొందరు స్వార్థ రాజకీయాల కోసం మంత్రిపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, అందుకు మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ వెంకటరమణ, సీనియర్ నాయకులు వెంకటేశ్వరరావు, మాధవనాయుడు, శ్రీరాములుయాదవ్, ఐదు మండలాల కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం దేవరకొండ నాగార్జున భార్య ప్రసూనాంబ జ్ఞాపకార్థం అన్నదానం చేశారు. నాగార్జున మాట్లాడుతూ తన భార్య 3వ వర్ధంతి సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన గర్భిణులు, రోగులు, వారి సహాయకులు మొత్తం 130 మందికి భోజనం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాదళ్ సమితి కన్వీనర్ శంకరప్ప, నాగార్జున కుటుంబ సభ్యులు రమేష్, నందిని, ప్రభావతి, కులసాయి, తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో భోజనం వడ్డిస్తున్న నాగార్జున, తదితరులు

బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - బుక్కపట్నం

బుక్కపట్నం మండల కేంద్రానికి చెందిన జన సేన పార్టీ సీనియర్ నాయకుడు పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్ తండ్రి పత్తి చలపతి ఇటీవల మృతిచెందాడు. ఈ నేపథ్యంలో అనంతపురంలో నివాసం ఉన్న పత్తి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సింధూర రెడ్డి పరామర్శించారు. పత్తి చలపతి చేసిన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా పత్తి చలపతి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండలంలోని గ్రామాల రైతులను నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ సోమవారం గాండ్లపెంట, మల్ల మీద పల్లి, గాజులవారిపల్లి సబ్ స్టేషన్ల పరిధిలోని విద్యుత్ లైన్ మాన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామానికినాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐలు నరసింహులు, గంగిరెడ్డి, లైన్‌మెన్ తదితరులు పాల్గొన్నారు.

23న మండల మీట్

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈనెల 23న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సాయిమనోహర్ తెలిపారు. ఎంపిపి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసిలు, ఆయా శాఖల అధికారులు, కో-ఆప్షన్ మెంబరు తదితరులు హాజరుకావాలని ఆయన కోరారు.

సమాచారహక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

మండల పరిధిలోని గొట్లూరు రైతు సేవ కేంద్రంలో మండల వ్యవసాయ శాఖ సిబ్బంది, గొట్లూరు సచివాలయ సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు ప్రజా చైతన్య వేదిక రాష్ట్ర కన్వీనర్ శ్రీ అబ్దుల్ రహిమాన్, ఎడి కృష్ణయ్య పాల్గొని సమాచార హక్కు చట్టం ప్రాధాన్యతను వివరించారు. ప్రతి కార్యాలయంలోనూ సమాచార హక్కు చట్టం సమాచారం రిజిస్టర్లు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ముస్తఫా, సమాచార హక్కుప్రజా చైతన్య వేదిక సభ్యులు ఆయాజ్ భాష, లింగమయ్య, పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో విద్యుత్ ఒప్పంద కార్మికుడు రియాజ్ మృతిచెందాడు. దీంతో స్థానిక సర్పంచి నాగలక్ష్మి రాజు ఆధ్వర్యంలో రియాజ్ కుటుంబ సభ్యులకు 15 వేల రూపాయలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాదిక్‌వలి, సిబ్బంది పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

ఖరీఫ్ సీజన్ లో వర్షాధార పంటగా సాగుచేసిన వేరుశనగ పంటలో పంటల దిగుబడి అంచనా కొరకు అధికారులు పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. సోమవారం మండలంలోని అప్పరాచెరువు గ్రామంలో మండల గణాంక అధికారి డాక్టర్ కెఎస్ లక్ష్మీనరసింహ శర్మ ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ఉపేందర్ రెడ్డి, ఎంపీఈవో నాగార్జున, వీఆర్ఏ బాబు గ్రామంలోని పలువురు రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్,కంటెంజెంట్ స్కూల్ ఆయాల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిరసన దీక్ష కార్యక్రమాన్ని సోమవారం స్థానిక ఎంఇఒ కార్యాలయం ఎదుట నిర్వహించారు. ఐ లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆదిశేషు, సిఐటియు నాయకులు జేవీ రమణ, టీ అయూబ్ ఖాన్, జంగమన్న అంగన్వాడీ నాయకురాలు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛభారత్ పేరుతో కార్మికులను ప్రభుత్వ పాఠశాలల శానిటేషన్ పనిచేయిస్తూ వారికి కేవలం 6వేల రూపాయల వేతనం ఇస్తున్నారన్నారు. అదేవిధంగా కంటెన్ జెంట్ ఆయాలకు కేవలం 4వేల రూపాయలు వేతనాలు ఇస్తున్నారని అన్నారు. పాఠశాలల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రతినెల వేతనాలు మంజూరు చేయాలని, కార్మికుల కుటుంబాలను కూడా ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్. నాగవేణి, జయమ్మ, చౌడమ్మ, ముంతాజ్, మున్సిపల్ ఇంజనీరింగ్ నాయకులు బొగ్గు నాగరాజు, అనిల్, రాము, పెద్దన్న, అంగన్వాడీ నాయకురాలు దీన, పోతక్క, అధికసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

ఆడుదాం ఆంధ్ర పేరుతో అడ్డంగా దోపిడీ

శాప్ ఛైర్మన్ రవినాయుడు

ప్రజాశక్తి-హిందూపురం

గత ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర పేరుతో ప్రభుత్వ ధనాన్ని అడ్డంగా దోపిడీ చేసిందని శాప్ ఛైర్మన్ రవి నాయుడు విమర్శించారు. హిందూపురం పర్యటనలో భాగంగా పట్టణంలోని ఎంజీఎం క్రీడా మైదానాన్ని ఆయన పరిశీలించారు. అర్ధాంతరంగా ఆగిపోయిన ఇండోర్ స్టేడియం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రవినాయుడు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2014-19 మధ్యకాలంలో టిడిపి అధికారంలో ఉందని ఆ సమయంలో క్రీడలను ప్రోత్సహించాలని సంకల్పించి ప్రతి నియోజకవర్గ కేంద్రంలో క్రీడా వికాస్ కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని అన్నారు. అయితే 2019 ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం కేవీకే కేంద్రాలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రాష్ట్రంలో ఏ ఒక్క నియోజకవర్గంలోనూ కెవికె కేంద్రాలు ప్రారంభం కాలేదన్నారు. విజయనగరంలో 99 శాతం పనులు పూర్తి అయ్యి, కేవలం ఒక్క శాతం రూ. 10 లక్షలు వెచ్చించి నీటి సౌకర్యం కల్పించి ఉంటే ఇది వినియోగంలోకి వచ్చేదన్నారు. కాళహస్తి నియోజకవర్గంలో పనులన్నీ పూర్తి అయ్యాయని కేవలం విద్యుత్ సౌకర్యం మాత్రమే మిగిలి ఉందని అన్నారు. క్రీడల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైసిపి ఆడుదాం ఆంధ్ర పేరుతో ప్రభుత్వ నిధులను దోచుకుని దోచుకుందని ఆరోపించారు. అయితే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్రీడలను ప్రోత్సహించాలని, ఆంధ్రప్రదేశ్ నుంచి ఒలంపిక్స్ క్రీడలకు ఎక్కువ మందిని పంపాలని చిత్తశుద్ధితో ఉన్నారని అన్నారు. దీనికోసం క్రీడా వికాస్ కేంద్రాలను అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎంజీఎం క్రీడా మైదానాన్ని నెల రోజుల్లో అన్ని విధాల అభివృద్ధి చేయడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. క్రీడా మైదానంలో అర్ధాంతరంగా ఆగిపోయిన ఇండోర్ స్టేడియం పనులను రీటెండర్ నిర్వహించి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో డిఎస్‌డిఒతో పాటు స్థానిక పీడీ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే



విజేతగా నిలిచిన ఎద్దుల యజమానులకు ట్రోఫీ అందజేత

ప్రజాశక్తి - బుక్కపట్నం

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు. మండలంలోని మారాల రిజర్వాయర్‌కు హంద్రీ నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులకు ఒక చుక్క నీరు విడుదల చేసింది లేదని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి రైతులకు చేసింది శూన్యం అన్నారు. గత వైసీపీ పాలనలో ఎమ్మెల్యేగా ఉన్న శ్రీధర్ రెడ్డి రైతులను ఏనాడు పట్టించుకోలేదని విమర్శించారు. ఎన్నికల అప్పుడు మాత్రమే వైసిపికి రైతుల గురించి ఆలోచిస్తుందని అన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగు మాసాల్లో మారాల రిజర్వాయర్‌కు నీటిని అందించే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ షాబుద్దీన్, కన్వీనర్ మల్లిరెడ్డి, నాయకులు వెంకట నారాయణ రెడ్డి, గంగాధర్, వెంకట రాముడు, సుబ్బారెడ్డి, సుధీర్, మంజు తదితరులు పాల్గొన్నారు.

ఎద్దుల బండ్ల పోటీలు ప్రారంభం

కొత్తచెరువు : వాల్మీకి జయంతి సందర్భంగా మండలకేంద్రంలో నిర్వహించిన ఎద్దుల బండ్ల పోటీలను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకి జయంతి ఉత్సవాల్లో భాగంగా కొత్తచెరువు వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఎద్దుల బండ్లు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పోటీ నిర్వాహకులు వాల్మీకి భాస్కర్‌ను, ఆ సంఘం నాయకులను మాజీ మంత్రి అభినందించారు. అనంతరం ఈ ఎద్దుల బండ్ల పోటీలో ప్రథమ బహుమతి పొందిన లెజెండ్ ధర్మకు చెందిన ఎద్దులకు 40 వేల రూపాయలను , ద్వితీయ బహుమతి వాలి సునామి వెంకటేష్‌కు చెందిన ఎద్దులకు 30వేల రూపాయలు, తృతీయ బహుమతి శ్రీధర్ నాయుడుకు చెందిన ఎద్దులకు రూ.20వేలు, నాలుగవ బహుమతి చలపతి నాయుడుకు చెందిన ఎద్దులకు రూ.10వేలు ప్రకటించారు. ఈ నగదును ఆయా ఎద్దుల యజమానులను ఎమ్మెల్యే, మాజీ మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, మాజీ జడ్పిటిసి లక్ష్మీనారాయణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, డిపో భాస్కర్, వాల్మీకి సంఘం నాయకులు భాను ప్రకాష్ ,రాజా, శ్రీనివాసులు, నాగేంద్ర, బండి లక్ష్మన్న ,అక్కులప్ప, సాకే నర్సింలు, విజయ్, ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే రోడ్డు వెడల్పుపై అపోహలొద్దు

మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు

ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపల్ శాఖ పట్టణాభివృద్ధిలో భాగంగా రైల్వే రోడ్డును 70 అడుగులతో విస్తరణ చర్యలు తీసుకున్నామని ఇందులో ఏలాంటి సందేహం లేదని మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు అన్నారు. సోమవారం రైల్వే రోడ్డు భవన యజమానులతో కలిసి టిడిపి నాయకులు జెఈ వెంకటస్వామి మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులను కమిషనర్ చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా రైల్వే రోడ్డు విస్తరణపై కమిషనర్‌తో చర్చించారు. కమిషనర్ మాట్లాడుతు గతంలో నిర్ణయించిన విధంగా 70 అడుగులతోనే రోడ్డు విస్తరిస్తున్నామన్నారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో మాత్రం 100 అడుగులతో విస్తరణ చేస్తున్నామన్నారు. ఇక నష్ట పరిహారం విషయంలో ఎవరు ఆధైర్య పడాల్సిన అవసరం లేనదని, నష్ట పోయిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా నష్ట పరిహారం అందిస్తామని అన్నారు. పట్టణ ప్రజలు పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. అదే విధంగా ఇదే విషయంపై వైసిపి కౌన్సిలర్లు కమిషనర్‌ను కలిశారు. వారికి సైతం ఇదే విషయాన్ని వివరించి, పట్టణాభివృద్ధికి సహరించాలని కమిషనర్ కోరారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి-హిందూపురం

ఆరుగాలం కష్టపడి రైతులు సాగుచేసిన పంట ఉత్పత్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతు సంఘం నేతలు డిమాండ్ చేశారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతులకు 100శాతం సబ్సిడీతో విత్తనాలు ఎరువులు అందజేయాలని కోరారు. సోమవారం ఎఐకెఎంఎస్ రైతు సంఘం ఆధ్వర్యంలో పరిగి రోడ్డులోని మోతుకపల్లి వద్ద సత్యసాయి జిల్లా రైతుల ప్రథమ మహాసభలు నిర్వహించారు. సత్యసాయి జిల్లా నాయకులు రంగనాయకులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు మాట్లాడుతూ సమాజంలో ప్రతిదీ వ్యవసాయంతో ముడిపడి ఉందని, రైతులు కష్టపడితే తప్ప సమాజం ముందుకెళ్లదని అన్నారు. అలాంటి రైతుల పట్ల నేటి ప్రభుత్వాలు ఏమీ పట్టింపు లేకుండా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు కుల,మత ప్రాంతాలకు అతీతంగా ఐక్యమై ప్రశ్నించినప్పుడు మాత్రమే రైతు సమస్యలు పరిష్కరించబడతాయని ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నాగ ముత్యాలు, రాష్ట్ర అధ్యక్షులు ఎం.గిరీష్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తాయని చెబుతూనే కాలం గడుపుతున్నారని విమర్శించారు. అనంతరం సత్యసాయి జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

పుట్టగొడుగులు తిని ఆరుగురికి అస్వస్థత

ప్రజాశక్తి - చిలమత్తూరు

పుట్టగొడుగులు తిని ఆరుగురు అస్వస్థతకు గురైన ఘటన ఆదెపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులో పుట్టగొడుగులు లభించడంతో వాటిని కూరొండి తిన్న ఇంటిలో ఉన్న ఆరుగురు వెంకటశివప్ప, శాంతమ్మ, శ్రీనివాసులు, ఆదినారాయణమ్మ, అలివేలమ్మ, రంగప్ప, లక్ష్మికి వాంతులు అయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో చిలమత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు ఆరుగురిని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. ఫుడ్ పాయిజన్‌తోనే ఇలా జరిగి ఉంటుందని వైదులు చెబుతున్నారు. ప్రస్తుతం వీరి ఆరోగ్యం నిలకడగా ఉంది.

కేబుల్ వైరు చోరీ

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని ఎం.చెర్లోపల్లిలో పలువురు రైతులకు చెందిన బోర్ బావుల కేబుల్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకు వెళ్ళినట్లు బాధిత రైతులు తెలిపారు. ఎం.చెర్లోపల్లికి చెందిన చిట్రా నాగభూషణ, చిట్రా ఓబులేసు,చిట్రా చిన్న ఓబులేసు, బోడిమల్ల సూర్యనారాయణరెడ్డికి చెందిన భూముల్లో చీనీ పంట సాగు చేస్తున్నారు. గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో పంటలకు నీరు అవసరం లేకపోవడంతో రైతులు పొలాల వద్దకు వెళ్ళలేదు. ఈ నేపథ్యంలో రైతులు సోమవారం వ్యవసాయ బావుల వద్దకు వెళ్లగా వారి బోరు బావులకు ఉన్న కేబుల్ వైర్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. దాదాపు 100మీటర్ల కేబుల్ వైరును గుర్తుతెలియ వ్యక్తులు ఎత్తుకువెళ్లినట్లు బాధిత రైతులు వాపోయారు. ఆరు నెలల క్రితం కూడా వ్యవసాయ బావుల వద్ద స్టార్టర్లు చోరీకి గురయ్యాయని వాపోయారు. ఈ విషయమై బత్తలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతులు తెలిపారు.

కలెక్టర్ చొరవతో బాధితులకు సాయం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

తిరుపతి వద్ద రోడ్డు ప్రమాదానికి గురైన ధర్మవరం ప్రాంతానికి చెందిన వారికి కలెక్టర్ ప్రత్యేక చొరవతో ప్రధానమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సాయం అందింది. మండల ప్రధాన కేంద్రంలో నివసిస్తున్న కొన్ని కుటుంబాలు 2022 మార్చి 26న ప్రత్యేక బస్సులో ధర్మవరం నుండి తిరుపతికి బయలుదేరాయి. తిరుపతిలో జరిగే పెళ్ళికి హాజరవడానికి వెళుతున్న వీరి బస్సు మదనపల్లి, పీలేరు, భాకరాపేట ఘాట్ రోడ్డులో రాత్రి 11 గంటల సమయంలో ఘోర ప్రమాదానికి గురైంది. సుమారు 51 మందితో వెళుతున్న బస్సు ప్రమాదానికి గురి కావడంతో పదిమంది మృతిచెందాడు. 41 మంది క్షతగాత్రులయ్యారు. అప్పట్లో వారికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేసింది. ప్రస్తుత జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ కృషితో ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి మృతిచెందిన వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందేలా చొరవ తీసుకున్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయలు, గాయపడిన వారికి ఒక్కొక్కరికి రూ. 50 వేలు వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలలో ఈనెల 18న జమయిందని కలెక్టర్ చేతన్ తెలిపారు.

డిపిఓను కలిసిన నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఇటీవల బాధ్యతలు చేపట్టిన జిల్లా పంచాయతీ అధికారి సమతను జిల్లా ఈవోపీఆర్డీ అసోసియేషన్ సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షురాలు నసీమా, బుక్కపట్నం ఈవోఆర్డీ అశోక్ కుమార్ రెడ్డి, ధర్మవరం మమతా దేవి, తనకల్లు రాజశేఖర్ రెడ్డి, కొత్తచెరువు నటరాజ్, డిపిఓను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీలలో నెలకొన్న సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చి, అభివృద్ధి పనులను పకడ్బందీగా నిర్వహించాలని డిపిఓ వారిని కోరారు. ఆయా మండలాల్లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైనా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

రీ సర్వే సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి బత్తలపల్లి

భూ రీ సర్వేలో సమస్యలుంటే అర్జీలు ఇవ్వాలని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ స్వర్ణలత పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అప్పరాచెరువు గ్రామంలో గ్రామసభను నిర్వహించి రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలాల రస్తా, గట్లు, కొలతలు, పట్టాదారు పుసుపుస్తకం తదితర సమస్యలు ఉంటే అర్జీలు ఇవ్వాలన్నారు. వాటికి పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు. అనంతరం రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ గ్రామసభలలో సర్వే డీఐ మురళి, రీ సర్వే డీటీ షణ్ముల కుమార్, సర్వేయర్ జోసెఫ్, విఆర్‌ఓలు విష్ణువర్ధన్‌రెడ్డి, సాకే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గురైన రైతు కుటుంబాలను ఆదుకోండి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైం

సత్యసాయి జిల్లాలో అధిక వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలు, పిడుగుపాటుకు గురై మృతిచెందిన రైతు కుటుంబాలను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సత్యసాయి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అడపాల వేమ నారాయణ, మహాదేవ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక వర్షం కారణంగా సత్యసాయి జిల్లాలోని 32 మండలాలలో దాదాపు 3వందల ఎకరాలలో వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, కంది, పంటలు తీవ్రంగా నష్టపోయారన్నారు. వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా సత్యసాయి జిల్లాలో ఉన్న చుక్కల భూములకు విముక్తి కల్పించి రైతులకు శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, జిల్లా సహాయ కార్యదర్శి అగ్గి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు మాత్రమే ఉచిత ఇసుక : ఆర్డీవో

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇళ్ల నిర్మాణాలకు మాత్రమే ఎద్దుల బండి, ట్రాక్టర్ ద్వారా ఉచితంగా ఇసుకను తీసుకు వెళ్లడానికి అనుమతి ఉందని ఆర్డీవో మహేష్ తెలిపారు. కేవలం ఇల్లు కట్టుకుంటున్న యజమాని ద్వారానే ట్రాక్టర్లో ఉచిత ఇసుకను తీసుకొని వెళ్లేందుకు అనుమంతి ఉందన్నారు. ట్రాన్స్‌పోర్టు ఖర్చులకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలలో సీసీ రేవు, పిసి రేవు వద్ద నుండి ఉచితంగా ఇసుకను పొందే అవకాశం ఉందని చెప్పారు.

ఊరి మధ్యలో మద్యం షాపులను ఏర్పాటు చేయొద్దు

ప్రజాశక్తి - ఓబుళ దేవర చెరువు

మండల కేంద్రంలో ఊరి మధ్యలో మద్యం షాపులను ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలని ఆర్ సి పి జిల్లా కార్యవర్గ సభ్యులు మున్నా, రైతు సంఘం రాష్ట్ర నాయకులు రామచంద్ర ,మండల కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బడికి గుడికి 500 మీటర్లు దూరంలో ఉండాలనే ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించి ఊరి మధ్యలో మద్యం షాపులను ఏర్పాటు చేయడం సరికాదన్నారు. మండల కేంద్రంలోనికదిరి హిందూపురం ప్రధాన రహదారి లో ఇరువైపుల మద్యం షాపుల ఏర్పాటు చేశారని దీని పల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే అక్కడున్న దుకాణాలను తొలగించి ఊరి బయట ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ రంగనాయకులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నరసింహులు, వెంకటేష్, సత్యప్ప తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు 'పురం' విద్యార్థులు

ప్రజాశక్తి-హిందూపురం

హరిద్వార్ లో జరిగే జాతీయస్థాయి గ్రాప్లింగ్ పోటీలకు హిందూపురం విద్యార్థులు ఎంపికైనట్లు శిక్షకులు చరణ్ రాజ్, ఉసామాఖాన్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు నవంబర్ 18 నుంచి 20 వరకు ఉత్తరాఖండ్ హరిద్వార్ లో జరిగే జాతీయస్థాయి గ్రాప్లింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. తమ కేంద్రంలో శిక్షణ పొందిన హితేష్ శ్రీ చరణ్, సయ్యద్, యాహియా, నందకిషోర్, అర్షద్, కె.ఎం. ఉసామా ఖాన్, కిషన్ సింగ్ రాజ్ పుత్ ఎంపికయ్యారని వారు తెలిపారు. హిందూపురం పట్టణానికి చెందిన విద్యార్థులు జాతీయస్థాయి క్రీడకు ఎంపిక కావడం పట్ల పుర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తి పోగొట్టుకున్న పర్సును గుర్తించిన కదిరి డిపోకి చెందిన డ్రైవర్ రమేష్ నాయుడు తిరిగి ఆ వ్యక్తిని అందజేసి తన నిజాయితీని చాటుకున్నాడు. కదిరి నుంచి విజయవాడ వెళుతున్న బస్సులో ప్రయాణికుడు నగదు కలిగిన పర్సు పోగొట్టుకున్నాడు.తన గమ్యస్థానం వచ్చే సరికి బస్సు దిగి వెళ్ళిపోయాడు. ఇంటికెళ్లిన అనంతరం పర్సు లేదని గుర్తించాడు. తన పర్సు బస్సులో పోయిందని డ్రైవర్ రమేష్‌కు సమాచారం అందించారు. దీంతో డ్రైవర్ బస్సు సీట్లలో వెతకగా పర్స్ దొరికింది. దీంతో నగదు పర్స్ ని బాధితుడికి అందజేశారు. డ్రైవర్ రమేష్ నిజాయితీని ఈసందర్భంగా పలువురు అభినందించారు.

ఉరుము కళాకారులను ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్న ఉరుము వాయిద్యానికి ఒక ప్రత్యేకత ఉందని ఉరుముల కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఉరుము కళాకారుల రాష్ట్ర కన్వీనర్ పూలకుంట రాము డిమాండ్ చేశారు. సోమవారం పుట్టపర్తి కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్య పరిష్కార వేదికలో మూడు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆయన అధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ మాల సామాజికవర్గం వారు శాతవాహన కాలం నాటికంటే ముందు నుంచి వంశపారంపర్యంగా పురాతన దేవాలయాల కొలువులలో వివిధ రకాలైన వాయిద్యాలు వాయించేవారన్నారు.ఉరుములు కొట్టడం, కొమ్ములు ఊదడం, పొమ్మలు, మాల దాసరి, ఆసాదు, దాసప్ప, బ్యాండ్ సెట్, లాంటి వాయిద్య కళలను తమ కులవృత్తిగా భావిస్తూ అక్కడ వచ్చే కానుకల ద్వారా తమ కుటుంబాలను పోషించుకునే వారన్నారు. మాలల్లో 16 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాలలోపు ఉన్న యువ కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డుతో పాటు కనీస గౌరవ వేతనం కల్పించాలని కోరారు. అలాగే ఎస్సీ కేటగిరిలోని మాదిగలకు డప్పు కళాకారుల కింద ఎలాగైతే పెన్షన్ ఇస్తున్నారో, అదేవిధంగా 7 రకాల వాయిద్య కళను నమ్ముకుని జీవిస్తున్న, 45 ఏళ్లు పైబడిన కళాకారులకు పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండురంగ మూర్తి, ఎం.ఎన్.మూర్తి, నాగరాజు, సత్యమయ్య, మైలసముద్రం రాము, నరసింహులు, గంగంపల్లి కేశప్ప, సోము, నాగభూషణ, పుల్లన్న, లక్కప్ప, తదితరులు పాల్గొన్నారు.

25న ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లా వ్యాపంగా వినికిడి సమస్య ఉన్న వారి కోసం ఈ నెల 25న హిందూపురం జిల్లా ప్రభుత్వ అసుపత్రిలోని డిఇఐసి భవనంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్యాధికారి మంజువాణి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు దీన్ దయాల్ శ్రవణా ఫౌండేషన్, జాతీయ ఆరోగ్య మిషన్, జాతీయ చెవుడు నిర్మూలన నియంత్రణ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. జిల్లాలో ఉన్న 0-19 సంవత్సరాల వయసు ఉండి, వినికిడి సమస్యతో బాధపడుతున్న వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, రెండు పాస్ పోటోలతో చెవి డాక్టర్ పరీక్షించి రాసి ఇచ్చిన ఓపి చీటీ, ఆడియాలజిస్ట్ రిపోర్టుతో పాటు అన్ని పత్రాలను తీసుకుని రావాలని కోరారు. ఈ శిబిరాన్ని చెవుడుతో బాధ పడుతున్నా వారందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇసుక, మద్యంలో అక్రమ వసూళ్లు వద్దు

ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ఇసుక, మద్యంలో అక్రమ వసూలు వద్దని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. కదిరి మదనపల్లి రోడ్డులో గల పీవీఆ ర్ ఫంక్షన్ హాల్ నందు టీడీపీ సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు ప్రాధాన్యతను వివరించారు. త్వరలో క్లస్టర్ ఇన్ ఛార్జి, యూనిట్ ఇన్ ఛార్జి , పోలింగ్ బూత్ ఇన్ ఛార్జిలకు టెలిగ్రామ్ డాట్ ద్వారా టిడిపి సభ్యత్వం నమోదుకు అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో ఎక్కడైనా ఇసుక దందా చేస్తే అలాంటి వారిపై చర్యలు తప్పవని కందికుంట హెచ్చరించారు. మద్యం దుకాణదారులకు ఇలాంటి ఇబ్బందులు ఉండకూడదన్నారు. త్వరలోనే బూత్ కన్వీనర్లు, పార్టీ కార్యకర్తలు అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పవన్ కుమార్ రెడ్డి, నియోజకవర్గ పరిధిలోని టిడిపి నాయకులు కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు హాజరయ్యారు.


సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

బాధితులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పంపిణీ చేశారు. సోమవారం స్థానిక పివిఆర్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన టిడిపి సభ్యత్వం సమీక్ష సమావేశంలో ఆయన చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పవన్ కుమార్ రెడ్డి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'రెయిన్‌బో' కరస్పాండెంట్‌కు అబ్దుల్ కలాం అవార్డు

ప్రజాశక్తి ఓబుళదేవర చెరువు

మండల కేంద్రంలోని రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ జయ సింహారెడ్డికి ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ ప్రతిభ అవార్డు వరించింది. ఈ మేరకు ఎస్పీ ఎల్‌టిఒ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నాగయ్య, ఎమ్మెల్సీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. ఆయన విద్యారంగంలో చేసిన సేవలను గుర్తించి సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ ,టీచర్స్ అసోసియేషన్ గుంటూరు వారి ఆంధ్ర క్రిస్టియన్ కాలేజీల్లో జరిగిన ప్రత్యేక సభలో ఈ అవార్డును అందజేశారు. రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం స్కూల్ పాఠశాల ఉపాధ్యాయ, సిబ్బంది, విద్యార్థులు, శ్రేయోభిలాషులు, అవార్డు గ్రహీతకు శుభాకాంక్షలు తెలిపారు.



జయసింహారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

కనీస మద్దతు ధరతో వేరుశనగ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా రైతుల పరస్పర సహాయక సహకార పరపతి సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వారు వినతి పత్రం అందజేశారు. పది రోజుల క్రితం 8వేల రూపాయలు ఉన్న వేరుశనగ ధర ప్రస్తుత 5వేల రూపాయలకు పడిపోయిందన్నారు. దీనికి తోడు పది రోజుల నుండి జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాల మూలంగా వేరుశనగ కాయలు దెబ్బతిన్నాయన్నారు. దాంతో వ్యాపారస్తులు కొనుగోలు చేయడానికి ముందుకు రాలేదని ఈ తరుణంలో రైతులను ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, భాస్కర్, రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.